మత్స్యరూపాయ.. కోనేతిరాయ..

- రేపటి నుంచి దేవరంపాడు నేతి వెంకన్న తిరునాళ్ల
- శనివారం నుంచి ఉగాది వరకు సంబరాలు
- నాలుగు శనివారాలు ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు

రాజుపాలెం: పల్నాటి తిరుపతిగా వెలుగొందుతున్న దేవరంపాడు కొండ తిరునాళ్ల శనివారం నుంచి ప్రారంభం కానుంది. ఉగాది (మార్చి 22)వరకు నాలుగు శనివారాలపాటు ప్రత్యేక పూజలు జరగనున్నాయి. మత్స్యరూపంలో దర్శనమిచ్చే వేంకటేశ్వరుడి కటాక్షం కోసం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు తరలిరానున్నారు. ఏటా ఫాల్గుణ మాసం ప్రవేశించిన తర్వాత వచ్చే మొదటి శనివారం నాడు ఇక్కడ ఉత్సవాలు మొదలవుతాయి. ఉగాది రోజు వరకు సంబరాలు నిర్వహించడం ఆనవాయితీ. ప్రధాన ఉత్సవాలు మూడు, నాల్గవ శనివారాల్లో (మార్చి11, 18వ తేదీల్లో) జరుగనున్నాయి.

నేతి వెంకన్న పేరు ఇలా..

దేవరంపాడు కొండపై మత్స్యరూపంలో కొలువైన వేంకటేశ్వరుడు విశిష్ట దైవమని ఈ ప్రాంత వాసులు నమ్మకం. పశు సంపదకు, పాడి పంటలకు ఆరాధ్యదైవమని ప్రజలు భావిస్తారు. పశువులు ఈనిన తర్వాత కవ్వం పెట్టగానే మూడు పూటలుగానీ, ఐదు పూటలుగానీ మీదు కట్టిన వెన్నను తెచ్చి స్వామికి పొంగళ్లు పొంగిస్తారు. ఆలయం చుట్టూ పశువులను ప్రదక్షిణ చేయించి నెయ్యి, బియ్యం, పప్పు, బెల్లం వగైరాలు స్వామికి సమర్పిస్తారు. వందేళ్లుగా ఈ ఆచారం కొనసాగుతోంది. నెయ్యి, వెన్న సమర్పిస్తారు కనుక స్వామి నేతి వెంకన్నగా కీర్తిగడించారు.

పకడ్బందీ ఏర్పాట్లు

తిరునాళ్లకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు కూడా ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ప్రధానంగా తిరునాళ్ల ఆరంభమైన తర్వాత రెండు, మూడు, నాలుగు శనివారాల్లో లక్షలాది మంది భక్తులు వచ్చే ఆస్కారం ఉన్న నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ అంబటి బ్రహ్మయ్య, ఆలయ కార్యనిర్వహణాధికారి గుర్రం శ్రీనివాసరెడ్డి తెలిపారు. 4వ తేదీన రెండో శనివారం స్వామి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్టు వివరించారు. ఆలయంలో శనివారాల్లో ప్రతేక పూజలు చేయించుకునే వారు ముందుగా ఈఓకు తెలియజేయాలని కోరారు. వీఐపీలు ముందుగా పాస్‌లు పొందాలని సూచించారు. దివ్యాంగులకు, చంటి పిల్లల తల్లులకు ప్రత్యేక దర్శనానికి అనుమతి ఉందని వెల్లడించారు. పకడ్బందీగా బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఎస్‌కే షఫీ చెప్పారు.


ఉత్సవాలకు సిద్ధమైన వేంకటేశ్వరస్వామి దేవస్థానం

గోపురం లేని ఆలయం

స్వయంభువుగా మత్స్యరూపంలో వెలసిన వేంకటేశ్వరస్వామి గర్భగుడిపై గోపురం నిర్మించేందుకు అనేకమార్లు యత్నించినా ఫలించలేదు. గోపురం కట్టిన ప్రతిసారీ పడిపోతుండడం వల్ల ఇప్పటికీ ఇక్కడ గోపురం నిర్మాణం కనిపించదు. గోపురం, కలశం లేని వేంకటేశ్వరస్వామి ఆలయం దేవరంపాడులో మాత్రమే ఉంది. దీంతో ఈ గుడి వెనుక భాగంలో మరో ఆలయాన్ని నిర్మించి టీటీడీ తయారు చేయించిన వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని తీసుకొచ్చి ప్రతిష్ఠించారు.


మత్స్యరూపంలో కొలువైన వెంకన్న


టీటీడీ నుంచి తీసుకొచ్చిన వేంకటేశ్వరస్వామి విగ్రహం

అభివృద్ధికి అంబటి విశేష కృషి

దేవరంపాడు ఆలయ అభివృద్ధికి రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు విశేష కృషి చేశారు. పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఇప్పటికే మండపం నిర్మిస్తున్నారు. ఆలయానికి ఇరువైపులా 40 అడుగుల వెడల్పుతో గ్రానైట్లతో బెట్లను ఏర్పాటు చేశారు. ఈఓ కార్యాలయం వరకు సీసీ రోడ్డును వేశారు. ఎన్‌ఎస్పీ కెనాల్ వద్ద స్నానాల ఘాట్లను నిర్మించారు. కొండ కింద నుంచి పైవరకు మధ్యలో డివైడర్‌ను, విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు. తిరుణాళ్ల సందర్భంగా చలువ పందిళ్లను వేశారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. ప్రతి శనివారం అన్నదానానికి ఏర్పాట్లు చేశారు.

క్లుప్తంగా

కుదురువారిపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్



కుందురువారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని కుందురువారిపాలెంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం గురువారం జరిగింది. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు ఎన్.సూర్యప్రకాశరావు, జయకృష్ణ పాల్గొని 67 మందికి వైద్య సేవలందించారు. అవసరమైన వారికి రక్త, బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి మందులను అందించారు. మధ్యాహ్నం నుంచి అనారోగ్యంతో బాధపడుతూ మంచానికే పరిమితమైన వారి ఇళ్ళకు వెళ్ళి వైద్య సేవలు అందించారు. సూపర్‌వైజర్లు పీటర్‌డానియేల్, జోస్పిన్‌రాణి, నాగమల్లేశ్వరరావు, భవానీకుమారి, డీఈఓ రవితేజ, మనుతేజ, ఏఎన్‌ఎమ్‌లు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి

పెదకూరపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చట్ట సభల్లో, పార్టీ పదవుల్లో బీసీలకు ప్రాధాన్యత ఇచ్చి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నారని పల్నాడు వైఎస్సార్ సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు కాసర్ల చిన్న శ్రీను పేర్కొన్నారు. గురువారం పంచాయతీ కార్యాలయంలో చిన్న శ్రీనును వైఎస్సార్ సీపీ మండల బీసీ నాయకులు సత్కరించారు. ఈసందర్భంగా చిన్న శ్రీను మాట్లాడుతూ బీసీల అభ్యున్నతికి, వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేస్తానన్నారు. చిలకా చంద్రయ్య, రజిని కృష్ణనాయక్, జాని, అంబటి నారాయణ, నరసింహారావు, వీరబాబు, సమరం పాల్గొన్నారు.

రైతుల పురోభివృద్ధికి తోడ్పడాలి

ఏఎంసీ చైర్మన్‌గా నియమితులైన బాబూరావుకు సత్కారం



సత్తెనపల్లి: ప్రభుత్వ పథకాలను రైతులకు అందించడంతోపాటు వారి పురోభివృద్ధికి తోడ్పడుతూ బాబూరావు భవిష్యత్తులో మరెన్నో పదవులు అలంకరించాలని సీనియర్ న్యాయవాదులు దాసరి జ్ఞాన్ రాజ్ పాల్, మాదంశెట్టి వేదాద్రి చెప్పారు. సత్తెనపల్లి వ్యసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కొత్తగా నియమితులైన న్యాయవాది పెండెం బాబూరావును గురువారం న్యాయవాదులు అభినందించారు. సత్తెనపల్లి చరిత్రలో ఇప్పటి వరకు దళిత సామాజికవర్గానికి ఇటువంటి పదవి ఇవ్వలేదని చెప్పారు. అనంతరం పెండెం బాబూరావును సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు జిల్లెల పాల్ రాజ్, జెట్టి శేఖర్, మూర్తి, శంకర్, జడా ప్రసాద్ పాల్గొన్నారు.

చిట్టాపురంలో పశువిజ్ఞాన బడి

ఈపూరు: మండలంలోని చిట్టాపురం గ్రామంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు విజ్ఞాన బడి కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పశుసంవర్ధక శాఖ ఈపూరు సహాయ సంచాలకులు డాక్టర్ పి.శ్రీనివాసమూర్తి మాట్లాడుతూ ఏడాదికి ఒక దూడను ఎలా పొందాలో పశుపోషకులకు వివరించారు. పశుపోషణలో ఎలాంటి మెలుకువలు పాటిస్తే లాభాలు పొందవచ్చన్నారు. పశుసంవర్ధక శాఖ తరపున సబ్సిడీలో ఇస్తున్న సమీకృత దాణాను వినియోగించుకోవాలన్నారు. అలాగే పశువులు, గొర్రెలు, మేకలు అకస్మాత్తుగా ఇబ్బందులకు గురైనప్పుడు 1962 నంబరు ద్వారా కాల్ సెంటర్‌కు ఫోన్ చేస్తే ఉచిత పశువుల అంబులెన్స్ సేవలు పొందుతారన్నారు. కార్యక్రమంలో ముప్పాళ్ల పశువైద్యాధికారిణి డాక్టర్ ఎం. సునీత, పశుగణ సహాయకుడు సాంబశివరావు, పశుపోషకులు తదితరులు పాల్గొన్నారు.

రీసర్వేలో భాగంగా డ్రోన్ సర్వే ప్రారంభం

బొల్లాపల్లి: రీసర్వేలో భాగంగా మండలంలో డ్రోన్ సర్వే నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జి తహసీల్దార్ సుధాకర్ శర్మ గురువారం తెలిపారు. తొలుత వెల్లటూరు రెవెన్యూ గ్రామం శివారు నాయుడుపాలెంలో డ్రోన్ సర్వే పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. మండలంలోని ప్రతి రెవెన్యూ గ్రామ పరిధిలో డ్రోన్ సర్వే చేస్తామని, అనంతరం డ్రోన్ సర్వేలో ఓఆర్‌ఐ మ్యాప్‌ను గ్రామ రెవెన్యూ మ్యాప్‌తో అనుసంధానించి తదుపరి భూ హద్దులు నిర్ణయిస్తామని ఇన్‌చార్జి తహసీల్దార్ చెప్పారు.

చలో విజయవాడను జయప్రదం చేయండి

రొంపిచర్ల: మండలంలోని మాచవరం గ్రామంలో సీపీఐ ఆధ్వర్యంలో మార్చి 2వ తేదీన నిర్వహించ తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని నాయకులు కరపత్రాలను గురువారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

తప్పుడు కథనాలతో విద్వేషాలు రెచ్చగొడుతున్నారు

ఈనాడు ప్రతులు దహనం చేసిన వైఎస్సార్ సీపీ నాయకులు

క్రోసూరు: అబద్ధాలు, అసత్యాలు రాసి ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొడుతున్న ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికల్ని, టీవీ5ను వెంటనే బ్యాన్ చేయాలంటూ వైఎస్సార్ సీపీ పెదకూరపాడు నియోజకవర్గ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం పార్టీ క్రోసూరు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మార్కెట్‌యార్డు చైర్మన్ ఈదాసాంబిరెడ్డి మాట్లాడుతూ ఈనాడు పత్రిక పట్టాభిని కొట్టారంటూ పాత ఫొటోలు మెయిన్ పేజీలో పెట్టడం దారుణమన్నారు. ప్రజల్ని తప్పుదోవ పట్టించటం, ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొట్టి పబ్బం గడుపుకుంటున్న పచ్చ పత్రికల్ని వెంటనే బ్యాన్ చేయాలని డిమాండ్ చేశారు. బెల్లంకొండ ఎంపీపీ పద్మావెంకటేశ్వరెడ్డి మాట్లాడుతూ ఈనాడు ఇప్పటికైనా తప్పుడు రాతలు రాయడం మానుకోకపోతే ప్రజలే తిరగబడి తగిన బుద్ధి చెబుతారని అన్నారు. అనంతరం పార్టీ కార్యాలయం ఎదుట ఈనాడు పత్రిక ప్రతులను దహనం చేసి నిరసన తెలిపారు. పెదకూరపాడు జెడ్పీటీసీ కన్నాశివాజీ, క్రోసూరు జెడ్పీటీసీ గఫూర్ క్రోసూరు, పార్టీ మండల అధ్యక్షుడు వెలది అప్పారావు, మాజీ యార్డు డైరెక్టర్ పాశం శ్రీనివాసరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు అనుముల కోటిరెడ్డి, రైతు విభాగం నాయకుడు నారు శ్రీనివాసరెడ్డి, తిప్పిరెడ్డి అప్పిరెడ్డి, గంజినబోయిన శ్రీనివాసరావు, షేక్ ఖాదర్, పెదకూరపాడు ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, సీహెచ్ శాయిరెడ్డి, సర్పంచ్ మాగులూరి అనిల్ తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్ సీపీ కార్యాలయం ఎదుట ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న దృశ్యం

అమరావతిలో...

అమరావతి: తెలుగుదేశం పార్టీ జాతీయ అధికార ప్రతినిధి పట్టాభిని పోలీసులు హింసించారంటూ ఈనాడు పత్రికలో వచ్చిన కథనాలు పచ్చి అబద్ధాలని వాటిని ప్రజలు నమ్మరని జీడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కోట హరిబాబు అన్నారు. గురువారం స్థానిక పంచాయతీరాజ్ అతిథి గృహంలో ఏర్పాటు చేసి సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనాడు పత్రిక యజమాన్యం తాము ప్రచురించిన ఫొటోలు అబద్ధమని నిర్ధారించటం చూస్తే పత్రిక ఏ స్థాయికి దిగజారిందో అర్థం చేసుకోవచ్చన్నారు. ఎన్నోఏళ్లుగా వైఎస్సార్‌సీపీ మీద, సీఎం వైఎస్ జగన్ మీద నిత్యం అవాస్తవ కథనాలు రాయటం పచ్చ మీడియాకు అలవాటుగా మారిందన్నారు. ఈసమావేశంలో జడ్పీ కో–ఆప్షన్ సభ్యుడు షేక్ హష్మీ, మండల సచివాలయ కన్వీనర్ భవిరిశెట్టి హనుమంతరావు, ఎండ్రాయి సర్పంచ్ నాయుడు రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు అలా లక్ష్మీనారాయణ, కొండవీటి కోటేశ్వరరావు, నందూరు కరుణకుమార్ పాల్గొన్నారు.

సామాజిక న్యాయం నినాదం కాదు.. జగన్ విధానం

- రాజ్యాధికారంలో బడుగులకు ప్రాధాన్యం
- అన్ని వర్గాలకూ సమన్యాయం వైఎస్సార్ సీపీ ధ్యేయం
- ఈనెల 26న సత్తెనపల్లి ఏఎంసీ కమిటీ ప్రమాణ స్వీకారం
- చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు

సత్తెనపల్లి: సామాజిక న్యాయం నినాదం కాదని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆచరిస్తున్న విధానమని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు చెప్పారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో గురువారం ఆయన ముఖ్య నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. చల్లంచర్ల మాట్లాడుతూ ఇటీవల సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించిన శాసన మండలి సభ్యుల 18 మంది జాబితాలో 11 మంది బీసీలు, ఇద్దరు ఎస్సీలు, ఒకరు ఎస్టీ, ఓసీ సామాజికవర్గానికి చెందిన నలుగురికి పదవులు కేటాయించారని పేర్కొన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని గతంలో ఎన్నడూ లేని విధంగా దళిత సామాజికవర్గానికి కేటాయించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈనెల 26న సత్తెనపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం అట్టహాసంగా జరగనుందని, ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు, పార్టీ నాయకులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. అనంతరం పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడిగా ఎంపికైన పట్టణ 24వ వార్డు కౌన్సిలర్ అచ్యుత శివప్రసాద్‌ను నాయకులు అభినందించారు. శాలువాతో సత్కరించి, పూలమాలవేసి సన్మానించారు. ఆయన నియామకానికి సహకరించిన మంత్రి అంబటికి అచ్యుత కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు రాయపాటి పురుషోత్తమరావు(సత్తెనపల్లి రూరల్), భవనం రాఘవరెడ్డి(నకరికల్లు), ఏపూరి.శ్రీనివాసరావు(రాజుపాలెం), రాష్ట్ర వ్యవ సాయ సలహా మండలి సభ్యుడు కళ్ళం విజయ భాస్కర్ రెడ్డి , జెడ్పీటీసీ సభ్యురాలు సంకటి నాగేశ్వరమ్మ, నాయకులు ఎం.జె.ఆర్ లింగారెడ్డి, మర్రి సుబ్బారెడ్డి, పెండెం బాబురావు, దొంతి రెడ్డి శ్రీనివాసరెడ్డి, సిరిగిరి గోపాలరావు , నక్క శ్రీను, సహారా మౌలాలి, కౌన్సిలర్ అవ్వారు శ్రీను, జొన్నలగడ్డ ఆనంద్, జూపల్లి పాల్, చిలుకా జయపాల్, వల్లెం నరసింహారావు, తాళ్ళూరి మోహన్ బాబు, యనమాల సింగయ్య స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న చల్లంచర్ల సాంబశివరావు, చిత్రంలో నాయకులు

సమష్టి కృషితోనే రాష్ట్రస్థాయి 4వ ర్యాంకు

సత్తెనపల్లి ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట్రావు

సత్తెనపల్లి: సమష్టి కృషితోనే సత్తెనపల్లి ఏరియా వైద్యశాలకు రాష్ట్రస్థాయిలో 4వ ర్యాంక్, జిల్లాస్థాయిలో 2వ ర్యాంక్ వచ్చిందని సత్తెనపల్లి ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ ఈటిపోగు వెంకట్రావు చెప్పారు. పట్టణంలోని ఏరియా వైద్యశాలలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ వెంకట్రావు మాట్లాడుతూ ఏరియా వైద్యశాలలో డాక్టర్లు సమృద్ధిగా ఉన్నారని, సేవలను నిరంతరం కొనసాగిస్తూ సేవా భావంతో పనిచేస్తున్నారని కొనియాడారు. అలాగే హాస్పిటల్ అభివృద్ధి కమిటీ ఎక్కడా లేనటువంటి శ్రద్ధ వహించి హాస్పిటల్‌కు మంచి పేరు తీసుకువచ్చేలా పని చేస్తోందని కొనియాడారు. హాస్పిటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు హాస్పిటల్ మీద ప్రత్యేక శ్రద్ధ వహించి అన్ని విషయాల్లోనూ సహకారం అందిస్తున్నారన్నారు. అదే విధంగా డాక్టర్లు, స్టాఫ్ నర్సులు అంకితభావంతో పని చేస్తున్నారన్నారు. ఒకప్పుడు 300–400 ఉండే ఓపీ ఇప్పుడు సుమారు 800 నుంచి 1,000 దాకా వస్తుందని, వారందరికీ సరైన వైద్యం అందుతుందని తెలియజేశారు. హాస్పిటల్ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ సయ్యద్ కాజా మాట్లాడుతూ మునుపెన్నడూ లేనటువంటి అన్ని సేవలు అందుబాటులో ఉన్నాయని, దానివల్ల నాలుగో ర్యాంకు సాధించగలిగామని, డాక్టర్ల, స్టాఫ్ నర్స్ పనితీరును కొనియాడారు. సమావేశంలో ఆర్ఎంఓ శోభారాణి, డాక్టర్ లక్ష్మణరావు ఉన్నారు.


మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట్రావు

'పది'లో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలి

ఎంపీపీ చెన్నుపురెడ్డి పద్మావెంకటేశ్వరరెడ్డి

బెల్లంకొండ: పదవ తరగతి విద్యార్థులు బాగా కష్టపడి చదివి.. వచ్చే నెలలో రాయబోతున్న పరీక్షలలో మంచి మార్కుల సాధించాలని ఎంపీపీ చెన్నుపురెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని కస్తూర్బా గాంధీ గురుకుల పాఠశాలలో ఎంపీపీ ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలో తరగతి గదులకు వెళ్లి విద్యార్థులతో మాట్లాడి, సమస్యలను తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు పెట్టే భోజనాన్ని పరిశీలించారు. అన్నం, కూరలు రుచికరంగా ఉండే విధంగా, బాలికలు ఇష్టంగా తినే విధంగా చూడాలని తెలిపారు. మెనూ తప్పనిసరిగా పాటించాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. వారానికి ఐదుసార్లు ఖచ్చితంగా కోడిగుడ్లు ఇవ్వాలని తెలిపారు. అనంతరం పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా పాఠశాలల నీటి సమస్య ఉందని పాఠశాల ప్రిన్సిపాల్ ఎంపీపీ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో వెంటనే నీటి సమస్యలు లేకుండా నూతన బోర్‌వెల్ వేసే విధంగా చర్యలు చేపట్టాలని ఎంపీపీ సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో చిట్యాల సర్పంచి బాణావతు నరసింహనాయక్, పాఠశాల ప్రిన్సిపాల్ ఉష, సిబ్బంది పాల్గొన్నారు.


విద్యార్థులకు అందించే భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ

అసత్య ప్రచారాలు చేస్తే సహించం

అచ్చంపేట: అసత్య ప్రచారాలు చేస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ఇమేజ్‌ను డామేజ్ చేస్తే ఊరుకునేది లేదని అచ్చంపేట మండలం వైఎస్సార్ సీపీ నాయకులు హెచ్చరించారు. ఈనాడు పత్రికలో పట్టాభిపై దాడి అంటూ పాత ఫొటోలు పెట్టి అసత్య ప్రచారం చేయడంపై మండల నాయకులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈనాడు విషపు రాతలను ఖండించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిలకా చంద్రయ్య, ఎంపీపీ భూక్యా రజనీనాయక్, అచ్చంపేట సర్పంచ్ కంబాల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభసాటి

పెదకూరపాడు: ప్రకృతి వ్యవసాయం ఆరోగ్యమే కాకుండా ఎంతో లాభసాటి అని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సాయి మార్కండేయరెడ్డి జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళి, ప్రకృతి వ్యవసాయం డీపీఎం అమలకుమారి అన్నారు. పెదకూరపాడులోని రైతు నందిగం కిషోర్ రసాయన పురుగు మందులు వినియోగించకుండా ప్రకృతి వ్యవసాయం విధానాన్ని వారు పరిశీలించారు. మిరప పంటలో అంతర్ పంటగా ఉన్న క్యారెట్, బిట్‌రూట్, ముల్లంగి పంటలను పరిశీలించి రైతు అనుభవాలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా సాయి మార్కండేయరెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగు చేయడం ద్వారా రైతులకు ఖర్చు తగ్గడంతోపాటు, భూసారం పెరుగుతోందన్నారు. అమలకుమారి మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందులు వాడకుండా భూమిని కాపాడుకునేందుకు ప్రకృతి వ్యవసాయమే మేలన్నారు. ప్రతిరైతు తనకున్న పొలంలో కొంత భాగంలోనైనా ప్రకృతి వ్యవసాయ విధానాన్ని అమలు చేయాలన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో భూసారం పెరుగుతోందన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.


ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన ముల్లంగిని పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ బృందం

చిరుధాన్యాలపై అవగాహన ర్యాలీ

పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరు రైతు భరోసా కేంద్రం వద్ద చిరు ధాన్యాలపై గురువారం అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ.మురళీ మాట్లాడుతూ చిరు ధాన్యాలు తక్కువ కాలంలో తక్కువ పెట్టుబడితో సాగు చేసుకోవచ్చు అన్నారు. రైతు అదనపు దిగుబడి పొందడంతోపాటు, ఆహారపు అలవాట్లలో చిరు ధాన్యాలు చేర్చుకోవడం వల్ల ఆరోగ్యం కాపాడుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వం చిరు ధాన్యాలను మద్దతు ధరలకు కొనుగోలు చేస్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా సూక్ష్మ అవసర ఆహార శుద్ధిపరిశ్రమలు నెలకొల్పుతామన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ సాయి మార్కండేయ రెడ్డి మాట్లాడుతూ ఆరోగ్యం బాగుండాలంటే చిరు ధాన్యాల ఆహారపు అలవాటు చేసుకోవాలన్నారు. డీపీఎం అమల కుమారి మాట్లాడుతూ చిరు ధాన్యాలు సాగుతో భూసారం పెరుగుతోందన్నారు. కార్యక్రమంలో క్రోసూరు మార్కెట్ యార్డు చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ శివకుమారి, ఏఓ ప్రవీణ్, శాంతి, అరుణ, పీఏసీఎస్ డైరెక్టర్ కల్లి శ్రీనివాసరెడ్డి, హుస్సేన్‌నగర్ సర్పంచ్ మాగులూరి అనిల్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

28 లోపు ఈ-పంట నమోదు చేసుకోవాలి

క్రోసూరు: మండలంలోని రైతులు ఈనెల 28 కల్లా ఈ- పంట నమోదు చేసుకోవాలని, అదేవిధంగా ఈకేవైసీ నమోదు చేసుకోవాలని ఏఓ వేణుగోపాల్ గురువారం తెలిపారు. మండలంలో ఈఏడాది రబీ సీజన్‌లో వరి-536 ఎకరాలు,మొక్కజొన్న 198 ఎకరాలు, శనగ 85, పెసర 25, మినుము 7, ఇతరాలు 23 ఎకరాలు, మొత్తం 873 ఎకరాల్లో పంట సాగు చేయటం జరిగిందన్నారు. ఈ పంటలను రైతులు ఆయా గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల్లోని సిబ్బందిని కలిసి ఈ-పంట నమోదు, ఈకేవైసీ నమోదు చేయించుకోవాలని కోరారు. ఈనెల 28వ తేదీ ఆఖరు తేదీని అని తెలిపారు.

సర్వే సిబ్బందికి భూపత్రాలు అందజేయండి

నకరికల్లు: గ్రామాల్లో రీసర్వే చేపడుతున్న సిబ్బందికి రైతులు సహకరించాలని తహసీల్దార్ ఎస్.సురేష్ సూచించారు. మండలంలో చేపడుతున్న రీసర్వే పనులను గురువారం సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ గ్రౌండ్ కంట్రోల్ పాయింట్ గుర్తించి గ్రామాల్లో సర్వే వేగవంతంగా సాగుతుందని పేర్కొన్నారు. రైతులు తమ భూమి పత్రాలు, ఫోన్‌నంబర్, ఆధార్ వివరాలు అందజేయాలని కోరారు.

1న చైతన్య గోదావరి బ్రాంచ్ ప్రారంభోత్సవం

శావల్యాపురం: మండలంలోని కారుమంచి గ్రామంలో (మార్చి) వచ్చే నెల 1వ తేదీన ఉదయం 10 గంటలకు చైతన్య గోదావరి గ్రామీణ నూతన బ్యాంకు శాఖను ప్రారంభోత్సవం చేస్తున్నట్లు శావల్యాపురం బ్రాంచ్ శాఖ మేనేజరు ఇలింద్రపర్తి విశ్వనాథ్ గురువారం తెలిపారు. నియోజకవర్గ శాసనసభ్యులు బొల్లా బ్రహ్మనాయుడు, బ్యాంకు చైర్మన్ టి.కామేశ్వరరావు, నరసరావుపేట రీజనల్ మేనేజరు మారుతీరామ్, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, బ్యాంకు అధికారుల సారథ్యంలో నూతన బ్రాంచ్ ప్రారంభోత్సరం జరుగుతుందన్నారు. చిలకలూరిపేట బ్రాంచ్ శాఖలో విధులు నిర్వహిస్తున్న కావూరి సాయిచంద్ర చౌదరి కారుమంచి బ్యాంకు మేనేజరుగా నియామకమైనట్లు చెప్పారు. ఆయనతో పాటు సహాయ మేనేజరు గుబ్బల సుధీర్‌బాబు, నివ్య, నగదు అధికారి మహేష్, రామిరెడ్డి తదితరులు ఉన్నారు.

రేపు గణపయ్య తిరునాళ్ల

యడ్లపాడు: ముక్కోటి దేవతల్లో ప్రథమ పూజితుడైన విఘ్నేశ్వరస్వామి వార్షిక తిరునాళ్ల మహోత్సవం శనివారం ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యడ్లపాడు మండలం కారు చోెల-గుత్తావారిపాలెం గ్రామాల మధ్య పీబీసీ కాలువ ఒడ్డుపై కొలువున్న ఈ స్వామి 32వ వార్షికో త్సవానికి సంబంధించిన పనులు చురుగ్గా చేస్తున్నా రు. ఈ సందర్భంగా గుడి మరమ్మతులు, పెయింటింగ్ పనులు దాదాపుగా పూర్తయ్యాయని.. అలాగే భారీగా తరలి వచ్చే భక్తుల కోసం అవసరమైన సౌకర్యాలను సిద్ధం చేస్తున్నట్లు అభివృద్ధి కమిటీ సభ్యులు వెల్లడించారు. శనివారం తెల్లవారుజాము నుంచి గణపతి స్వామికి పంచామృత అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలతో ప్రారంభించి అనంతరం భక్తులకు దర్శనం భాగ్యం కలిగిస్తారు. సాయంత్రం మూడు గ్రామాల నుంచి భారీ విద్యుత్ ప్రభలు తరలి వస్తాయని, తిరునాళ్ల సందర్భంగా జాగరణ చేసే భక్తులకు భజనలు, కోలాటాలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసినట్లు అభివృద్ధి కమిటీ సభ్యులు చెప్పారు. భక్తులు వేలాది వచ్చి వినాయక స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించి స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

నరసరావుపేట టౌన్: రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన గురువారం పట్టణంలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. బాబాపేట సమీపంలో సుమారు 30 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి మృతదేహం రైలు పట్టాలపై పడి ఉందని స్థానికుల నుంచి వచ్చిన సమాచారం మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్నట్లు ఎస్ఐ టి.సుబ్బారావు తెలిపారు. మృతుడు గోధుమ రంగు చొక్కా, బ్లూకలర్ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతుడి ఆనవాళ్లు తెలిసిన వారు రైల్వే పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని ఎస్ఐ కోరారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పై కప్పు తొలగించి చోరీ

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని ముండ్లమూరు బస్టాండ్ సెంటర్‌లో గల ఓ కిరాణా షాపులో బుధవారం దొంగతనం చోటు చేసుకుంది. ముండ్లమూరు సెంటర్‌లో కిరాణా మర్చంట్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు అచ్యుత మూర్తెయ్య కిరాణా షాపులో పై కప్పు రేకులు తొలగించి సుమారు రూ.50వేలు విలువైన సరుకులను దొంగలు దోచుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉచితంగా భూ సర్వే హద్దురాళ్లు: జేసీ

నరసరావుపేట రూరల్: జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష పథకంలో భాగంగా మండలంలోని దొండపాడులో జరుగుతున్న భూముల రీసర్వే పనులను జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. గ్రామంలో భూముల రీసర్వే పూర్తికావడంతో ఇప్పటికే రైతులకు పాస్‌బుక్‌లను అందజేశారు. రీ సర్వే అధారంగా గ్రామంలో హద్దురాళ్లు వేసే పనులను చేపట్టారు. పంట భూముల్లో చేపట్టిన హద్దురాళ్లు వేసే పనిని ఆయన పరిశీలించారు. భూ సమస్యలకు తావు లేకుండా పకడ్బందీగా భూముల రీ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. మండలంలోని పది గ్రామాలకు సంభందించిన 23 వేల అయా గ్రామాలకు చేర్చినట్టు తెలిపారు. హద్దురాళ్లను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు. గ్రామానికి తరలించిన హద్దురాళ్లను భూము ల వద్దకు చేరవేసి అడుగున్నర గుంత తీసి నిలబెట్టే పనికి కూడా ప్రభుత్వం నగదు చెల్లిస్తుందని తెలిపారు. ఒక్కో హద్దురాయిని తరలించి నిలబెట్టినందుకు రూ.90లు చెల్లిస్తామన్నారు.